క్లుప్తంగా

నేడు పాఠశాలలకు సెలవు

చిలకలపూడి (మచిలీపట్నం): జిల్లాలో విపరీతంగా కురుస్తున్న వర్షాల కారణంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి తహెరా సుల్తానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య (ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు) పాఠశాలలకు సెలవు ప్రకటించామని, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ఆదేశాలు అమలు అయ్యేలా చూడాలని, ఈ సెలవును వచ్చే ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించేలా చూడాలని సూచించారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. స్థానిక మహాత్మ గాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ-1 పండు రాణిలు సమావేశానికి గైర్హాజరు కావడంతో వైస్ ఎంపీపీ-2 చందు రమాదేవి సమావేశానికి అధ్యక్షత వహించారు. కాగా 24 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరు కావడంతో ఎంపీడీవో రత్నకుమారి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



గన్నవరం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది బదిలీపై నూజివీడు వెళ్తున్న పి. అరుణ్‌కుమార్‌ను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో అరుణ్‌కుమార్ చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పారు. ఉద్యోగ జీవితంలో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. సీనియర్ అసిస్టెంట్ కె.సూర్యకళ, ఉద్యోగులు పి. ప్రశాంత్‌కుమార్, యు. నాగరాజు, వై. శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘ నాయకులు కె. బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లా సర్వీసు రోడ్లు



ఉయ్యూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా సర్వీసు రోడ్లు, అండర్‌పాస్‌లు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం నీరు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఆటోలు, కార్లు, బైక్‌లు రాకపోకలు సాగించలేని దుస్థితి. ఇంజిన్లలో నీరు చేరి వాహనాలు మరమ్మతులకు గురవుతున్న పరిస్థితి. దీంతో గగ్గోలు పెట్టడం వాహనదారుల వంతయ్యింది. వర్షాలకు ఉయ్యూరు పట్టణంతోపాటు, గ్రామాల్లో సైతం అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి.

కొనసాగుతున్న టీచ్ టూల్స్ శిక్షణ

కంకిపాడు: టీచ్ టూల్స్ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడివాడ డివిజన్ స్థాయి టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ అభ్యసన, బోధన పద్ధతులు, విద్యా విషయక అంశాలపై ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాలను ఎంఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

బ్లడ్‌గ్రూప్ అందరికీ తెలియాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరికీ బ్లడ్‌గ్రూప్ తెలిసి ఉండాలని గైనకాలజిస్ట్ డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. గాంధీజీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బ్లడ్‌గ్రూప్ తెలుసుకొని ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమకు ప్రమాదం సంభవించినా, ఇతరులకు రక్తం అత్యవసరంగా అందించాల్సి ఉన్నా బ్లడ్‌గ్రూప్ తెలిసి ఉండటం వల్ల వెంటనే నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ నిర్వహించారు.

శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు



పెద ఓగిరాలలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు వస్తున్న భక్తులు



ఆత్కూరులో శాకంబరీదేవిగా కనకదుర్గాదేవి



కానూరు తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి శాకంబరీ అలంకరణ



యనమలకుదురులో శాకంబరీ అలంకరణలో శ్రీపార్వతీదేవి



గోసాలలో కనకదుర్గ అమ్మవారు



సూరంపల్లిలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు వస్తున్న భక్తులు

పెనమలూరు: మండల పరిధిలో శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని అమ్మా.. కరుణించు తల్లీ.. అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. భక్తులు 20 రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పూజారి నాగవెంకట దుర్గవిశ్వనాథ పవన్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- గోసాల వైకుంఠపురంలో వేంచేసి ఉన్న శ్రీ కనక దుర్గ మల్లేశ్వరస్వామివారి దేవస్థానం దుర్గ అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు జరిగాయి. అర్చకుడు బ్రహ్మశ్రీ దేవరకొండ బుచ్చి వెంకట రామసిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అమ్మవారికి గాజుల అలంకరణ నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ, స్థానికులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.
- యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం శ్రీపార్వతీ దేవి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు శ్రీమహానందీశ్వర స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ అమ్మవారిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లకు ఆషాఢ మాస సారెలను భక్తులు సమర్పిస్తున్నారు. తరిగొప్పల గ్రామంలో శుక్రవారం సర్పంచ్ యాండ్రపు అనిత ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సారెను సమర్పించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కోటగిరి రామ్మోహన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ఆత్కూరులో కనకదుర్గాదేవిని వివిధ కూరగాయలతో అలంకరించడంతో అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని శివాలయంలో శ్రీ జగదాంబదేవి, తోట్లవల్లూరు రోడ్డులోని విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని భక్తులు శాకంబరీ అలంకరణలో దర్శించుకుని విశేష పూజలు జరిపించారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డి ఇంటి నుంచి మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి రామాలయంలో పూజలు జరిపించి, అనంతరం శివాలయంలో భ్రమరాంబ దేవికి సారె సమర్పించారు. ఆలయ పూజారి గూడూరి రమేష్‌శర్మ పూజలు చేయించారు.

సూరంపల్లిలో అమ్మవారికి ఆషాఢ సారె

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాస సారె, వ్యాస మహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మ, మద్దిరావమ్మ, పోతురాజు దేవాలయాల నుంచి కోదండ సీతారామాలయం మీదుగా భక్తులు సారె, బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో జై దుర్గా, జైజై దుర్గా నామస్మరణ చేశారు. ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వై.పాండురంగారావు, మహిళా కన్వీనర్ రాజేశ్వరి, మల్లంపాటి వెంకటేశ్వరరావు, బెజవాడ మధు, బౌతుల నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవో కుటుంబానికి మంత్రి పరామర్శ



కానూరులో ఎంపీడీవో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పెనమలూరు: నరసాపురం ఎంపీడీవో మండల వెంకటరమణారావు అదృశ్యం కావడంతో కానూరులో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. ఎంపీడీవో ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. కాగా శుక్రవారం నాటికీ కూడా ఎంపీడీవో ఆచూకీ తెలియకపోవడంతో మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు పరామర్శించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఎంపీడీవో వెంకటరమణారావు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడానని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ చేస్తుందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పటికే విచారణకు ఆదేశించారని తెలిపారు.

గ్రామ పంచాయతీలో అవకతవకలు

విచారణ చేపట్టిన కలెక్టర్



ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ నాగేశ్వరనాయక్

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గన్నవరం గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విచారణ జరిపారు. అవినీతికి బాధ్యులైన సర్పంచ్ నిడమర్తి సౌజన్య, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజేంద్ర వరప్రసాద్ విచారణకు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలో జరిగిన రూ. 1.58 కోట్లు నిధుల దుర్వినియోగంపై ఈఓ, సర్పంచ్ నుంచి ఆయన వివరణ తీసుకున్నారు. అయితే కొన్ని బిల్లులు సక్రమంగా ఉన్నప్పటికీ అప్పటి విచారణాధికారి పరిగణలోకి తీసుకోలేదని వివరణ ఇచ్చారు. సదరు విచారణపై పునఃసమీక్ష చేయాలని కోరారు. ఫిర్యాదుదారులైన మాజీ సైనిక ఉద్యోగి ఎం. రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు కూడా కలెక్టర్‌ను కలిశారు. దుర్వినియోగానికి గురైన నిధులను వెంటనే రికవరీ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలని కోరారు. అవినీతికి పాల్పడిన ఈఓ, సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీఎన్. పురం సమీపంలోని అయోధ్య అపార్ట్‌మెంట్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా తాగునీటి సరఫరా చేయడంపై కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ నాగేశ్వరనాయక్ సదరు అపార్ట్‌మెంట్స్ వద్దకు వెళ్లి తాగునీటి సరఫరా లైన్లను, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. డీఎల్‌పీఓ సంపత్‌కుమారి, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేకుండా వర్షం



నీటితో నిండిన కంకిపాడు బస్టాండు ప్రాంగణం



గోసాలలో అరటి తోటలో నిలిచిన వర్షపునీరు

కంకిపాడు: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి మోస్తరు వర్షం పడుతూనే ఉంది. వర్షానికి తోడు తీవ్రమైన చలి గాలులు వీస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలన్నా కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. వర్షానికి రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచిపోయింది. కంకిపాడు బస్టాండు ప్రాంగణం వర్షపు నీటితో చెరువుగా మారింది. వర్షం నీటిలో రాకపోకలు సాగించలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వదలకుండా కురుస్తున్న వర్షానికి ఉద్యాన పంటలైన పసుపు, అరటి, కూరగాయ తోటల్లో నీరు చేరింది. పొలాల్లో మురుగు నిలవ ఉండకుండా రైతులు జాగ్రత్త పడుతున్నారు.

విజయవాడరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. వాతావరణ శాఖ మోస్తరు నుంచి భారీ వర్షంతోపాటు, అక్కడక్కడ పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు చేయడంతో ప్రజలు అత్యవసరం పనులు మినహా బయటకు రావడంలేదు. కొత్తూరు తాడేపల్లి, నున్న గ్రామాల్లో ఒక మోస్తారుగా వాగులు ప్రవహిస్తున్నాయి.

తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విజయవాడ రూరల్ తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వరదలు, వాగులు ప్రవహించి ఏ విధమైన ప్రమాదాలు సంభవించినా తహసీల్దారు కార్యాలయానికి సమాచారం తెలియజేయాలని అధికారులు సూచించారు.

తాడిగడప మున్సిపాలిటీలో ప్రత్యేక డ్రైవ్



పోరంకిలోని డ్రైయినేజీలో పూడిక తీయిస్తున్న కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు



నున్నలో పశువుల పాక వద్ద శుభ్రం చేయిస్తున్న అధికారులు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో వర్షాలు కురవడంతో మురుగునీటి పారుదలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ మేరకు మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం వివరాలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలు 37 ఉన్నాయని వర్షం వస్తే అవి జలమయమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. శుక్రవారం కానూరు ఉమాశంకర్‌నగర్, పోరంకి పీఅండ్‌టీ కాలనీ, సుగాలీ కాలనీ, బందరు రోడ్డు ప్రాంతాల్లోని డ్రెయినేజీల్లో పూడిక తీయించామని పేర్కొన్నారు. మిగితా ప్రాంతాల్లో కూడా డ్రెయినేజీ పనులు చేస్తామని తెలిపారు.

నున్న గ్రామంలో డ్రైడే-ఫ్రైడే...

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ. రమణ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గేదెలు, మేకలు, గొర్రెలు యజమానులు ప్రజలకు ఇబ్బంది లేకుండా పాకలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సచివాలయం-2, 3 పరిధిలో గ్రామ సచివాలయ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది గ్రామంలో జ్వరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కూడా డ్రైడే -ఫ్రైడే నిర్వహించారు.

కానూరులో స్కూటీ చోరీ

పెనమలూరు: కానూరులో ఇంటి ముందు ఉంచిన స్కూటీని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పెనమలూరు క్రైమ్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.నాగలక్ష్మి కానూరు తులసీనగర్ ఒకటో లైన్‌లో ఉంటుంది. ఆమె తన స్కూటీ ఇంటి ముందు పార్కు చేసింది. అయితే గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీని చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం గురు పూర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జోరున వర్షం కురుస్తున్నా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కలశస్థాపన, అఖండ దీపారాధన, గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదముల పంపిణీ జరిగింది.

26న పేరంటాలమ్మకు శాకంబరీ అలంకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 26వ తేదీన అమ్మవార్లను శాకంబరీ దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ మాసం బహుళ శుక్రవారం పురస్కరించుకుని శాకంబరీ అలంకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలంకరణ నిమిత్తం అమ్మవార్లకు కూరగాయలు, పండ్లు సమర్పించదలచిన భక్తులు ఈనెల 25న ఆలయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. భక్తులు అందజేసిన కూరగాయలు, పండ్లతో పేరంటాలమ్మను శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

రక్షణ రంగంలో విస్తృత అవకాశాలు



మాట్లాడుతున్న ఎస్ సందీప్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్షణ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్.సందీప్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యాన రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ త్రివిధ దళాల్లో పని చేసేందుకు వివిధ క్యాడర్లలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒకవైపు ఉపాధితో పాటుగా దేశానికి సేవ చేసే అవకాశాలను పొందవచ్చన్నారు. ఇటీవల అగ్నివీర్‌తల్ (ఆర్మీ), అగ్నివీర్‌జల్ (నేవీ), అగ్నివీర్‌వాయు (ఎయిర్‌ఫోర్స్) విభాగాల పేరుతో ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధితో పాటుగా దేశానికి సేవచేసే అవకాశం త్రివిధ దళాల ద్వారా పొందవచ్చన్నారు. వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్మన్ రవికిషోర్, సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ చెప్పారు. జూన్ 29న బెంగుళూరులోని ఐసీఏఐ ప్రధాన కార్యాలయం వద్ద మొదలైన ఎంఎస్ఎంఈ అండ్ స్టార్టప్-2024 బస్సుయాత్ర శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకుంది. ఈ బస్సుకు ఐసీఏఐ విజయవాడ చాప్టర్ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిట్టా రవికిషోర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై అవగాహన కోసం బస్సుయాత్ర అన్ని రాష్ట్రాల్లోనూ ప్రచారం చేస్తోందన్నారు. అందులో భాగంగా శుక్రవారం నగరానికి విచ్చేసిందని, తర్వాత తెలంగాణకు బస్సు వెళుతుందని చెప్పారు. ఐసీఏఐ విజయవాడ చాప్టర్ వైస్‌చైర్మన్ నారాయణ కంచమరెడ్డి, కార్యదర్శి జయంత్ ఉప్పులూరి, కోశాధికారి మనీష్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని గవర్నరుపేట, మొగల్రాజపురం, ఎంజీ రోడ్డులో ఈ బస్సు ప్రచారం నిర్వహించింది.

ఆరోగ్య బీమాను పునరుద్ధరించండి

బార్ కౌన్సిల్ చైర్మన్‌కు బీబీఏ ప్రతినిధుల వినతి

విజయవాడస్పోర్ట్స్: న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించాలని, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) విషయంపై న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, కార్యదర్శి పద్మావతిని బీబీఏ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. గతంలో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని పునరుద్ధరించి న్యాయవాదులకు, వారి కుటుంబాలకు అండగా ఉండాలని, సీవోపీపై న్యాయవాదుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో బీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, ఎ.శివరామప్రసాద్(రాజా), కోశాధికారి ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, కె.కాంత్రికుమార్ ఉన్నారు.

పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల స్థితిని పొందుపరచాలని అంగన్‌వాడీ కేంద్రాల రాష్ట్ర కోఆర్డినేటర్ జె.సునీత అన్నారు. పోషణ ట్రాకర్ అప్లికేషన్ నిర్వహణ, నమోదు పర్యవేక్షణలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల రాష్ట్ర కోఆర్డినేటర్ జె.సునీత నగరంలోని బాడవపేట, నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో పెరుగుదలను క్రమం తప్పకుండా ప్రతి నెలా పర్యవేక్షించడం చాలా ముఖ్యమన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని ముందుగానే గ్రహించడానికి, సరైన పోషణను అందించడానికి తలిదండ్రులకు సహాయపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి నెలా క్రమం తప్పకుండా పిల్లల సరైన ఎత్తు, బరువు వివరాలను అప్లికేషన్‌లో పొందుపరచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు కానీ అర్హులైన లబ్ధిదారులందరిని కలిసి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రోజువారీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాల వివరాలను క్రమం తప్పకుండా అప్లికేషన్‌లో పొందుపరచాలని సూచించారు. పర్యవేక్షణలో విజయవాడ సెక్టార్ సూపర్ వైజర్ రెహానా, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

గన్నవరం: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను శుక్రవారం గన్నవరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం ...మండలంలోని దావాజిగూడెంలో కొంతమంది యువకులు గంజాయి తాగడంతో పాటు ఇతరులకు విక్రయాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలో తనిఖీలు చేసి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 1.860 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లుగా పోలీసులు తెలిపారు.